క్లుప్తంగా

రోడ్డు పరిశీలన



వర్షానికి కొట్టుకుపోయిన రోడ్డును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణ

బొబ్బిలి: పట్టణంలోని ఎనిమిదో వార్డు పరిధిలోని జయప్రకాష్ పాఠశాల వద్ద అధ్వానంగా తయారైన రోడ్డును మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణ గురువారం పరిశీలించారు. గుంతలమయమైన ఆ రోడ్డులో ఇటీవల మట్టితో సమతలం చేశారు. అయితే రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయింది. ఉదయం రోడ్డు పరిస్థితిని చూసిన ఆయన కొత్తగా సీసీ రోడ్డు నిర్మిస్తామని తెలిపారు. నిర్మాణానికి అవసరమైన అంచనాలు రూపొందించి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

నేడు సైకిల్ ర్యాలీ

బొబ్బిలి: వనం–మనం కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణంలో శుక్రవారం సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. హరితాంధ్ర లక్ష్యంగా మున్సిపల్ కార్యాలయం నుంచి స్వామి వారి వీధి మీదుగా రాణిమల్లం దేవి పార్కు వరకు ఈ ర్యాలీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం అక్కడి చెరువు గట్టుపై మొక్కలు నాటనున్నామన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న జన విజ్ఞాన వేదిక సభ్యులు

బొబ్బిలి: పట్టణంలోని తాండ్రపాపారాయ మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన జన విజ్ఞాన వేదిక డివిజన్ స్థాయి సమావేశంలో చెకుముకి సైన్స్ సంబరాలకు సంబంధించి, రూపొందించిన వాల్‌పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. సెప్టెంబరు 25న పాఠశాల స్థాయిలో, అక్టోబరు 1న మండల స్థాయిలో, అక్టోబరు 27న జిల్లా స్థాయిలో, నవంబరు 9, 10 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో ఆ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో శంబంగి శ్రీనివాస్, రాజగోపాల్, రమణమూర్తి, సత్యంనాయుడు, కృష్ణదాస్ తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు రమేష్‌నాయుడు

బొబ్బిలి: పట్టణ పరిధిలోని పాతబొబ్బిలిలో ఉన్న పలువురు నిరుపేద మహిళలకు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు గురువారం చీరలు వితరణ చేశారు. తమ అభిమాన నటుడు, సినీ హీరో అక్కినేని నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాగార్జున అభిమాన సంఘం నాయకుడు కె.పైడిరాజు, తూముల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురు జయంతి



పూజలు చేస్తున్న రుత్వికులు

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామ శారద పీఠంలో గురు జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. సహస్ర చండీ మహాయజ్ఞ అంపోలు రుద్రకోటేశ్వర శర్మ శిష్య బృందం ప్రత్యేక పూజలు చేపట్టి, గురువు రాధాకృష్ణ శర్మను స్మరించారు.

అన్ని వసతులు ఉండాలి

రాజాం: ప్రైవేటు పాఠశాలల్లో అన్ని వసతులు ఉండాలని ఎంఈవో యాగాటి దుర్గారావు సూచించారు. గురువారం స్థానిక పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించిన ఆయన.. రికార్డుల నిర్వహణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, ప్లేగ్రౌండ్, ఫైర్ సేఫ్టీ మేనేజ్‌మెంట్‌లు చూసి, సూచనలు చేశారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన

శృంగవరపుకోట: జీవిత బీమా రంగాన్ని నిర్వీర్యం చేసేలా చేస్తున్న కుట్రలను ఉపసంహరించుకోవాలని ఎల్ఐసీ ఏజెంట్లు గురువారం ఆందోళన చేశారు. ఇదే విషయమై స్థానిక ఎల్ఐసీ కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఇచ్చిన పిలుపు మేరకు సీఐటీయూ నేతృత్వంలో ఆందోళన చేసిన ఏజెంట్లను ప్రభావితం చేసే బీమా సుగం, బీమా విస్తార్, బీమా వాహక్, బీమా ట్రినిటీ, బీమా విట్రాగ్, జీవన్ సమర్థ్‌లను అమలు చేయొద్దని, ఎల్ఐసీని జీఎస్టీ నుంచి మినహాయించాలని, రూ.5లక్షలు దాటిన పాలసీలపై ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని నినాదాలు చేశారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి జయంతి పురస్కరించుకుని, తెలుగు భాషా దినోత్సవం.. ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, అధికారులు, ఉపాధ్యాయులు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, ఆయా రంగాల్లో వారు చేసిన కృషిని కొనియాడారు. గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని వాడుక భాషలోకి తీసుకువచ్చి, నిత్య వ్యవహారంలోని వాడుక భాషలో ఉన్న మాధుర్యాన్ని, వీలును తెలియజేసిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి అని, తనదైన ఆటతీరుతో ప్రపంచ హాకీ చరిత్రలో భారత్ పేరు నిలబెట్టిన గొప్ప క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ అని ప్రశంసించారు. ఆదర్శప్రాయుల జీవిత చరిత్రలను అందరూ తెలుసుకుని, ఉన్నతమైన సమాజ నిర్మాణానికి వారి అడుగుజాడల్లో నడవాలని కోరారు.

– బొబ్బిలి, రాజాం



రామభద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు



రేగిడి: లింగాలవలసలో గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాఠశాల సిబ్బంది



బొబ్బిలి రూరల్: గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



సంతకవిటి: హొంజరాం ప్రభుత్వ పాఠశాలలో గిడుగు, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న దృశ్యం



రాజాం సిటీ: కంచరాం జిల్లా పరిషత్ పాఠశాలలో ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



బొబ్బిలి: మండల కేంద్రంలో నీరజ్ చోప్రాకు అభినందనలు తెలియజేస్తున్న క్రీడాకారులు



వంగర: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు



తెర్లాం: ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, తదితరులు



రాజాం: పెనుబాక ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది



తెర్లాం: పెరుమాళి ఆదర్శ పాఠశాలలో శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజ కవుల ప్రదర్శన



బొబ్బిలి: తెలుగు భాష గొప్పదనం వివరిస్తూ విద్యార్థినుల ప్రదర్శన



రాజాం సిటీ: పొగిరి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సిబ్బంది

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నిక



రేగిడి: ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్ఎంసీ(స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నిక గురువారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 8 తరగతులకు సంబంధించి 24 మంది మెంబర్లు ఎన్నిక కాగా, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికకు 17 మంది హాజరయ్యారు. వీరంతా ఏకగ్రీవంగా చైర్మన్‌గా పెంకి రమేష్‌ను, వైస్ చైర్మన్‌గా గొట్టాపు పార్వతిలను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి మరడాన రామినాయుడు తెలిపారు. అనంతరం సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్య, ప్రధానోపాధ్యాయుడు జి.రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

ఆగూరు ఎన్నిక వాయిదా

రాజాం: మండలంలోని ఆగూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఎస్ఎంసీ ఎన్నిక వాయిదా పడింది. గురువారం ఈ ఎన్నిక నిర్వహించాల్సి ఉండగా, 7, 8 తరగతులకు చెందిన మెంబర్ల ఎన్నిక జరగలేదని, మరోవైపు కోరం లేక చైర్మన్ ఎన్నిక వాయిదా వేసినట్లు ఎంఈవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గత రెండు పర్యాయాలుగా ఈ ఎన్నిక వాయిదాపడుతూ వస్తుండడంతో కలెక్టర్ దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లనున్నామన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

రేగిడి: విద్యార్థులు బాల్యం నుంచే మంచి ఆహారపు అలవాట్లు కలిగి ఉండాలని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ సూచించారు. స్థానిక ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆయుర్వేద వైద్యశిబిరం గురువారం నిర్వహించి, విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆయుర్వేద వైద్యం ద్వారా మంచి ఆరోగ్యం పొందవచ్చన్నారు. ప్రతిరోజూ మంచి ఆహారం తీసుకోవడంతో పాటు యోగాసనాలు వేయడం, ఉదయాన్నే త్వరగా లేవడం, సాయంత్రం వ్యాయామం వంటివి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్ టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేస్తున్న ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్

విధిగా వనమహోత్సవం చేపట్టాలి



రాజాం సిటీ: ప్రిన్సిపాళ్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐవో ఆదినారాయణ

రాజాం సిటీ: ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో శుక్రవారం వనమహోత్సవాన్ని విధిగా నిర్వహించి, మొక్కలు నాటాలని ఆర్ఐవో ఎం.ఆదినారాయణ కోరారు. స్థానిక చైతన్య జూనియర్ కళాశాలలో నియోజకవర్గంలోని అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో గురువారం సమావేశమైన ఆయన.. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల ఆవరణల్లో లక్ష మొక్కలు నాటాలని కలెక్టర్ తెలిపారన్నారు. అలాగే ప్రతీ విద్యార్థి డేటాను యూడైస్ ప్లస్‌లో పొందుపరచాలని, అధ్యాపకుల సమాచారాన్ని విధిగా బోర్డు లాగిన్‌లో నమోదు చేయాలన్నారు.

బొబ్బిలి రూరల్: మండలంలోని ఎం.బూర్జివలస, కమ్మవలస గ్రామాల్లో వనమహోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.రవికుమార్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్ మధుసూదనరావు హాజరుకానున్నారని, మండల స్థాయి అధికారులంతా రావాలన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

సంతకవిటి: మండలంలోని పనసపేట గ్రామానికి చెందిన పైడి ధర్మారావు, తల్లి లక్ష్మిలపై దాడి ఘటనలో అదే గ్రామానికి చెందిన సింగుపురపు అర్జునరావు, మోహిని, పైడి రాములు, రవి, గురుగుమెల్లి భీముడులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వాసుదేవరావు గురువారం తెలిపారు. ఇటీవల తమ పొలంలో తల్లీకొడుకులు(ధర్మారావు, లక్ష్మి) కలుపుమొక్కలు తీస్తుండగా, అక్కడ జరిగిన కొట్లాటలో తల్లీకొడుకులు గాయపడ్డారు. ప్రస్తుతం వారు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుడు ధర్మారావు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వృద్ధురాలికి గాయాలు

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని బొబ్బిలి జంక్షన్‌లో ఈ నెల 28వ తేదీ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక మాదగ వీధికి చెందిన పెరుమాళి అప్పమ్మ అనే వృద్ధురాలికి గాయాలైనట్లు సీఐ కె.అశోక్‌కుమార్ గురువారం తెలిపారు. అప్పమ్మ రోడ్డు దాటుతుండగా బొబ్బిలి రోడ్డు వైపు నుంచి రాజాం వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలపాలైందన్నారు. స్థానికుల సహాయంతో రాజాంలోని కేర్ ఆస్పత్రికి ఆమెను తరలించగా, చికిత్స పొందుతోందని, ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బాధ్యతగా పనిచేయాలి



అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశమైన ఐసీడీఎస్ పీవో కనకదుర్గ

రేగిడి: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలంతా బాధ్యతాయుతంగా పనిచేయాలని రాజాం ఐసీడీఎస్ పీవో కనకదుర్గ సూచించారు. స్థానిక ఉంగరాడమెట్ట వద్ద ఉన్న ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రంలో బూరాడ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలతో గురువారం సమావేశమైన ఆమె.. పలు సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా వారికి అందించాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్ నూకాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజులగుమడలో 'గ్రామ సందర్శన'



అంగన్‌వాడీ కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

వంగర: మండలంలోని రాజులగుమడ గ్రామ పంచాయతీలో గ్రామ సందర్శన కార్యక్రమం గురువారం నిర్వహించారు. తహసీల్దారు ధర్మరాజు, ఎంపీడీవో ఎల్.త్రినాథ్‌లు పెదరాజులగుమడ, చినరాజులగుమడ గ్రామాల్లోని సచివాలయం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను వారు తనిఖీ చేశారు. అనంతరం ప్రజా సమస్యలపై ఫిర్యాదులు సేకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

ప్రతి ఖాతా ఆన్‌లైన్ చేయాలి

గుర్ల: సహకార సంఘంలో నమోదైన ప్రతి రైతు వివరాలు, ఖాతాలను వేగవంతంగా ఆన్‌లైన్ చేయాలని జేసీ సేతు మాధవన్ పీఏసీఎస్ అధికారులను ఆదేశించారు. మండలంలోని కెల్ల ప్రాథమిక సహకార సంఘాన్ని ఆయన గురువారం సందర్శించారు. రైతుల వివరాల కంప్యూటరీకరణ జరుగుతున్న తీరు పరిశీలించారు. సెప్టెంబర్ మొదటి వారం నాటికి పీఏసీఎస్‌లో ఉన్న రైతుల ఖాతాల వివరాలను ఆన్‌లైన్ చేయాలన్నారు. అక్టోబర్ నెల నుంచి పీఏసీఎస్ లావాదేవీలు అన్ని ఆన్‌లైన్‌లో జరుగుతాయని తెలిపారు. రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ ఆదిలక్ష్మి, గుర్ల డీసీసీబీ బ్రాంచి మేనేజర్ ప్రీతి మానస, కెల్ల సొసైటీ సీఈఓ మండల శ్రీను ఉన్నారు.

100 రోజుల పని కల్పించాలి

తెర్లాం: ఉపాధి హామీ పథకం ద్వారా జాబ్‌కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి 100 రోజుల పాటు పని కల్పించాలని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులపై సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో పెండింగ్‌లో ఉన్న 7,400 పర్సన్ డేస్‌ను రెండు వారాల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఫారంపాండ్‌ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని, రూఫ్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌ను నిర్మించాలని, ల్యాండ్ బ్లాక్, ఇనిస్ట్యూషనల్, అవెన్యూ ప్లాంటేషన్‌ను త్వరితగిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో శుక్రవారం నిర్వహించనున్న వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులంతా పాల్గొనేలా మండల, గ్రామస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీవో సుశీల, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పథకం పనులపై సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

మున్సిపల్ కమిషనర్ పర్యటన

బొబ్బిలి:

వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణంలోని నాలుగో వార్డులో ఉన్న దావాల, రెల్లి, అంటాకుల వీధుల్లో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి గురువారం పర్యటించారు. ఆయా వీధుల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, అక్కడి పారిశుధ్య పరిస్థితులను ఆమె అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు వేయాలని, కాలువలు నిర్మించాలని అడగడంతో పాటు వీధి విద్యుత్ బల్బులు ఆన్‌చేయడం, ఆఫ్‌చేయడం, వీధి కుళాయిల ద్వారా నీరు విడుదల చేయడంలో సంబంధిత సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు ఆమె.. సంబంధిత సిబ్బందితో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



కాలువ పరిస్థితిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

'పాలమారిన ఊరు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, సాహిత్యాభిమానులు

రాజాం సిటీ: కళింగాంధ్ర రైతుల ఆత్మే పాలమారిన ఊరు కవిత్వమని పలువురు వక్తలు అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా స్థానిక వెంకటసూర్యదుర్గ కల్యాణ మండపంలో శాసపు రామినాయుడు(వెలుగు రామినాయుడు) 16 కవితలతో ముద్రించిన 'పాలమారిన ఊరు' అనే పుస్తకాన్ని మక్క అప్పలనాయుడు గురువారం ఆవిష్కరించారు. వెలుగు మిత్రుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కేంద్ర సాహిత్య యువ పురస్కార గ్రహీత బాల సుధాకర్‌మౌళి హాజరై, పుస్తక పరిచయం చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకంలో రైతులు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలను తన కవిత్వం ద్వారా అద్భుతంగా రామినాయుడు వర్ణించారని ప్రశంసించారు. శ్రీకాకుళం రైతాంగ పోరాటం, మడ్డువలస నిర్వాసితుల ఆవేదన ఈ పుస్తకంలో ఉందన్నారు. కార్యక్రమంలో రచయిత అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, ఏపీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్ మోహన్, చీకటి దివాకర్, గార రంగనాథం తదితరులు పాల్గొన్నారు.

పత్ర కషాయం తయారీపై అవగాహన

సంతకవిటి: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో పత్ర కషాయం తయారీపై గురువారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ పాత్రుని వెంకటరమణ మాట్లాడుతూ పత్ర కషాయాన్ని పంటలపై పిచికారీ చేయడం ద్వారా పంటకు పట్టే చీడపీడలు, తెగుళ్లు నివారించవచ్చన్నారు. అనంతరం పత్ర కషాయం తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. 200 లీటర్ల నీటిని ఓ డ్రమ్ములో తీసుకుని, దానిలో మునగ, జిల్లేడు, వేప, సీతాఫలం, బొప్పాయి, కలబంద ఆకులు, ఆవుపేడ, ఆవుమూత్రం కలిపి 15 రోజుల పాటు నిల్వ ఉంచిన తర్వాత పంటలపై పిచికారీ చేయాలన్నారు.



పత్ర కషాయం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది